క్లుప్తంగా

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



నడిపల్లిలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం నడిపల్లిలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభ చాటి ఆకట్టుకుంటున్నారు. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పోటీల్లో ప్రతిరోజూ 8 జట్లు పాల్గొంటున్నాయి. మరో వారం రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

బీమా ప్రీమియం చెల్లించాలి



నాయుడుగూడెంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్

పెదపాడు: రబీలో అపరాలు సాగు చేసే రైతులు వెంటనే ఎకరాకు రూ.60 పంటల బీమా సొమ్ము చెల్లించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొనిణి, నాయుడుగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ పసుసంవర్ధక శాఖ మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించే రైతులు ట్రక్ షీట్ జనరేట్ అయిన తరువాత ఎఫ్‌టీఓ వేలిముద్రలు వేస్తే ధాన్యం డబ్బులు త్వరితగతిన ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఈకార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన సర్వే పరిశీలన



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: బాదంపూడి సచివాలయాన్ని ఉంగుటూరు ఎంపీడీవో జీఆర్ మనోజ్ మంగళవారం సందర్శించారు. ఎన్‌పీసీఐ సర్వే, జియో ట్యాగింగ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేలపై సచివాలయం సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను, పశుగణన సర్వేను ఆయన పరిశీలించారు.

అతివేగంతోనే ప్రమాదాలు



మాట్లాడుతున్న డీటీసీ కరీమ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాల్లో అత్యధిక శాతం హెల్మెట్లు ధరించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోందని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. మంగళవారం స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతివేగంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా జరిగిన 475 రోడ్డు ప్రమాదాల్లో 144 మంది ద్విచక్ర వాహనాలు నడిపే వారు ప్రమాదాలకు గురయ్యారని వివరించారు. అందులో 85 మంది ద్విచక్ర వాహనదారులు మృతి చెందారని తెలిపారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు జి.ప్రసాదరావు, జగదీష్, పి.నరేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు


ఏలూరు (టూటౌన్): మహిళా హక్కులే.. మానవహక్కులు, మన హక్కులే.. మన భవిష్యత్తు అనే నినాదాలతో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక 44వ డివిజన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి ఎ.శ్యామలరాణిలు మాట్లాడుతూ భారతదేశంలో మానవహక్కులు క్షీణిస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా 185 దేశాల్లో 109వ స్థానంలో మనదేశం ఉందని తెలిపారు. బేటీ బచావో అని చెప్పే ప్రభుత్వం రాజ్యాంగ స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని తెచ్చి మహిళలు పోరాడి సాధించుకున్న హక్కుల్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉందని ఆరోపించారు. ఆడపిల్లలకు రక్షణ కరువైందని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నిరోధానికి కమిటీ ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఎక్కడా ఉనికిలో లేవని తెలిపారు. పలువురు ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అరకొర సేవలు

- కార్యాలయాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న ఉద్యోగుల కుర్చీలు
- పూర్తిస్థాయిలో అందని పౌర సేవలు
- ఉంగుటూరు మండలంలో 30 పోస్టుల వరకు ఖాళీ



ఉంగుటూరు- 2 సచివాలయ భవనం



ఉంగుటూరు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న ఉద్యోగుల కుర్చీలు

ఉంగుటూరు: ప్రజలకు సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో వారికి సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆనాడు పురుడుపోసుకున్న ఈ వ్యవస్థ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంది. కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా సచివాలయ ఉద్యోగులు సకాలంలో కార్యాలయాలకు రావడంలేదు. సరికదా ఉన్న కార్యాయాల్లో చాలా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వీటిని భర్తీచేసే ప క్రియ చేపట్టడం లేదు. దాంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. నియోజకవర్గం, మండల కేంద్రమైన ఉంగుటూరులో సచివాలయం-2 భవనాన్ని ప్రధాన కూడలి ప్రాంతంలో అధునాతనంగా నిర్మించారు. ఇందులో సచివాలయ కార్యదర్శి వేరే చోటుకు బదిలీ అయ్యారు. డిజిటల్ అసిస్టెంటు, వెటర్నరీ అసిస్టెంటు మాత్రమే కార్యాలయంలో కనిపిస్తున్నారు. మిగిలిన వారు ఎవరూ సచివాలయంలో లేరు. దాంతో కార్యాలయం వెలవెలబోతోంది.

ప్రజలకు సక్రమంగా అందని సేవలు

ఉంగుటూరు మండలంలో 25 సచివాలయాలు ఏర్పాటు చేశారు. 11 శాఖలకు చెందిన మండలం మొత్తం మీద 275 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేయాల్సిఉంది. కాని ప్రస్తుతం 245మంది మాత్రమే పనిచేస్తున్నారు. 30 పోస్టులకు చెందిన ఉద్యోగులు లేకపోవడం వల్ల ఆ శాఖలకు చెందిన సేవలు ప్రజలు పొందలేకపోతున్నారు. డిజిటల్ సహాయకులు పూర్తిస్థాయిలో ఉన్నారు. వెల్‌ఫేర్ అసిస్టెంట్లు 25మందికి 23మందే ఉన్నారు. రాచూరు, రావులపర్రులో వెల్‌ఫేర్ సహాయకులు లేరు. 25 మంది సర్వేయర్లకు 19 మంది ఉన్నారు. బొమ్మిడి, కాగుపాడు, కైకరంలో 1,2 రాచూరు, వెల్లమిల్లిలోని రెండు సచివాలయాలకు సర్వేయర్లు లేరు. దాంతో ఆరు చోట్ల సర్వే పనులు నిలిచిపోయాయి. లైన్‌మెన్లు 18మంది ఉండాలి కానీ కేవలం ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. లైన్‌మెన్లు లేని అన్నిచోట్ల విద్యుత్ సేవలు అరకొరగానే అందుతున్నాయి. గ్రామ రెవెన్యూ అధికార్లు 25 మందికి 21 మంది మాత్రమే ఉన్నారు. చేబ్రోలు 1, గోకవరం, రాచూరు, నారాయణపురం 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సర్వీసులు ప్రజలకు అందడంలేదు. మహిళా పోలీసులు 25కి 18 మంది ఉన్నారు.7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగుపాడు, కాకర్లమూడి, నాచుగుంట, వెల్లమిల్లి 1, 2, గొల్లగూడెంలో మహిళా పోలీసులు లేరు. పంచాయతీ కార్యదర్శులు 32 పోస్టులకు 28 మంది మాత్రమే ఉన్నారు. నాలుగు చోట్ల కార్యదర్శులు లేరు. రావులపర్రు గ్రేడు 1, ఎ.గోకవరం గ్రేడు 4, గ్రేడు 3, బొమ్మిడిలో గ్రేడు2, ఉంగుటూరు 2 సచివాలయంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో ఆయా కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇంజనీరింగు సహాయకులు 25 మంది పని చేయాల్సి ఉండగా 11పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో ఇంజ నీరింగు సేవలు ప్రజలు పొందలేకపోతున్నారు.

ఉద్యోగి బదిలీపై వెళితే ఆ పోస్టు ఖాళీ

ఇక్కడి ఉద్యోగులను బదిలీ చేసి అనంతరం ఆయా పోస్టులను భర్తీ చేయడం లేదు. దాంతో ఎంతో అధునాతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. భవనాలను అలంకారప్రాయంగా కాకుండా ప్రజలకు సేవలు అందించే కార్యాలయాలుగా బలోపేతం చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ప్రభుత్వంపై ఉందని పలువురు అంటున్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామ స్వరాజ్యం ఆశయ సాధన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలందించవచ్చు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రజలకు సేవలు అందించే విషయంలో కొంత ఇబ్బంది ఉన్నా, అన్ని చోట్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుటున్నాం.

– రాజ్ మనోజ్, ఎంపీడీవో, ఉంగుటూరు మండలం

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్

ఉంగుటూరు: 10వ తరగతిలో ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తీర్ణత సాధించడం కష్టమైన పని కాదని, ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పదవ తరగతి విద్యార్థులు అనుసరించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉంగుటూరు ఎంపీడీవో జీఆర్ మనోజ్ సూచించారు. మంగళవారం బాదంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉత్తేజితులు చేసేందుకు ఆయన వివిధ స్ఫూర్తిదాయకమైన అంశాలు వివరించారు. అదేవిధంగా సంబంధిత సబ్జెక్టు టీచర్లతో మాట్లాడి ప్రభుత్వం ఇచ్చిన వంద రోజులు యాక్షన్ ప్లాన్‌ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎక్కువగా రివిజన్ టెస్టులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు. ఎంపీడీవోతో పాటు బాదంపూడి వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించండి

దెందులూరు: పేద ముస్లిం చిన్నారుల విద్యాభివృద్ధికి, వసతి ఏర్పాట్లు కల్పించి సేవా భావంతో పాఠశాలను నిర్వహిస్తున్నామని జోగన్నపాలెం ఆరో మైలు సమీపంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చారిటబుల్ స్కూల్ ఫౌండర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ వశీవుల్లా సాహెబ్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు తెలిపారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పాఠశాల వద్ద డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డైరెక్టర్లు మహమ్మద్ ఉసామా పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: గర్భిణులు ప్రతి నెలా నాలుగుసార్లు పీహెచ్‌సీకి వచ్చి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో 7, 8, 9 నెలల గర్భిణులు 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, బీపీ, సుగర్, హెమోగ్లోబిన్, స్కానింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఆకుకూరలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పురుడు పోయించుకోవాలని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహక పథకాలను అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్‌బాబు మాట్లాడుతూ గర్భిణులు ఐరన్ మూలకం ఎక్కువగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకంలో అర్హులైన అందరినీ పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సిబ్బంది, నాయకులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రం అందించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని పర్మినెంట్ కార్మికులకు జనరల్, స్పెషల్ ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్ బిల్లులు, రిటైర్మెంట్ అయిన వారికి రావాల్సిన లీవ్ క్యాష్ మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు ప్రతి ఏడాది భోగి పండగ రోజు యూనిఫాం, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, కుట్టుకూలి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.32 వేలు నెలకు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, బంగారు రాజు, పొద్దుటూరు సురేష్, కరపాటి నాగరాజు, బంగారు మధు, ప్రసాదు పాల్గొన్నారు.

పేద విద్యార్థి వైద్యానికి గ్రామస్తుల ఆర్థిక సాయం



చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులకు రూ.2.84 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: గుండుగొలనులోని నిరుపేద విద్యార్థి అరశంకల చైతన్య కృష్ణ ఆపరేషన్‌కు గ్రామస్తులు అండగా నిలిచారు. గ్రామంలోని స్మార్ట్ విలేజ్ సొసైటీ ప్రతినిధులు ద్వారా సేకరించిన రూ.2.84 లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా విద్యార్థి తండ్రి అరశంకల సోములుకు అందజేసారు. ఈ సందర్భంగా స్మార్ట్ విలేజ్ సొసైటీ ప్రతినిధుల చొరవతో గ్రామస్తులు ఆర్థిక సాయాన్ని అందించడంపై ఆయన అభినందించారు. గ్రామంలోని అరశంకల సోములు సైకిల్ షాపు నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఆయన కుమారుడు చైతన్య కృష్ణ కీళ్ల వాతం వ్యాధికి గురవడంతో ఆపరేషన్లు చేసేందుకు రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీనితో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలవగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.2.5 లక్షలు మంజూరు చేయించారు. ఈ సొమ్ముతో ఒక ఆపరేషన్ చేసారు. మరో ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో స్మార్ట్ విలేజ్ సొసైటీలోని బుల్లి తెర దర్శకుడు తోట రవికుమార్, బంటు గణేష్ సహకార వేదిక ద్వారా రూ.2.84 లక్షలు సేకరించారు. ఆ సొమ్మును సోములు ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా చెక్కును అందించారు. విద్యార్థి చైతన్య కృష్ణను వారంతా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు మేనేజర్ నాగబాబు, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు బంటు విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ గేదెల సురేష్, గేదెల శ్రీను, గొర్లి బబ్లూ పాల్గొన్నారు.

పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో తనిఖీ



పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీలో పర్యటిస్తున్న గండి బాబ్జి, రైతు నాయకులు, సిబ్బంది

పెదవేగి : ఆయిల్‌పామ్ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పెదవేగి ఏపీ ఆయిల్ ఫెడ్ పామాయిల్ ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జ్ గండి బాబ్జి అన్నారు. మంగళవారం పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలోని ప్లాంట్ విభాగాల పనితీరును ఫ్యాక్టరీ మేనేజర్ యు సుధాకర్ వివరించారు. అనంతరం గండి బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్‌పర్సన్ ఫ్యాక్టరీ నిర్మించి 35 ఏళ్లు పూర్తయ్యిందని, తరువాత రూ.11 కోట్లు ఖర్చు చేసి మరమ్మతులు చేసినా నూనె దిగుబడి శాతం పెరగకపోగా, తగ్గిందని రైతు నాయకులు చెప్పడం బాధాకరమన్నారు. పెదవేగి ఫ్యాక్టరీని ఆధారంగా చేసుకుని జాతీయస్థాయిలో ఆయిల్ ధరలు నిర్ణయిస్తారని అన్నారు. ఇక్కడ రోజుకు 400 నుంచి 500 టన్నుల వరకు క్రషింగ్ జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వంతో సంప్రదించి, త్వరలో నూతనంగా ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు సూచించారు. ఫ్యాక్టరీ డిప్యూటీ మేనేజర్ ఎస్ శ్రీనివాసు, ఏఈఈ వై శ్రీనివాస్, రైతు నాయకులు ఉండవల్లి వెంకట్రావు, వీ రంగారావు, జీవీఎస్ఆర్‌కే ప్రసాద్, సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, హమాలీలు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

దెందులూరు: మతిస్థిమితం లేని మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మహిళ మృతి చెందిందని దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారావుగూడెం గ్రామానికి చెందిన అవివాహిత యువతి కాలి ఆశాజ్యోతి మతిస్థిమితం లేకపోవడంతోపాటు మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆమె మలకచర్ల, కండ్రిగ గ్రామాల మధ్య చెరువులో పడిపోవడంతో నీళ్లు తాగి మృతి చెందింది. మంగళవారం మృతదేహం చెరువులో పైకి తేలడంతో స్థానికులు గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారాన్ని తెలియజేశారు.

14న చర్చి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

దెందులూరు: రాష్ట్రీయ ముఖ్య కార్యదర్శి మసిలామోని స్టాలిన్ వైఎస్ కేజియల్ స్టాలిన్ ఈనెల 14న దెందులూరు రానున్నారని మంగళవారం జిల్లా డివిజనల్ కమాండర్ మేజర్ జల్లి మోషే తెలిపారు. స్థానిక గౌడ వీధిలో నూతనంగా నిర్మించిన సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిని ప్రారంభించేందుకు ఆయన వస్తున్నారని మోషే తెలిపారు. పర్యటన రూట్‌మ్యాప్, ఇతర ఏర్పాట్లపై స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య హైదరాబాద్ దైవజనులు పల్లె విశాల్, సంఘ పెద్దలతో చర్చించారు.

నేడు ఖోఖో పోటీలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మహిళల ఖోఖో పోటీలు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేలు తెలిపారు. మంగళవారం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఆయన ఈ వివరాలు విలేకరులకు వెల్లడించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు కొక్కిరపాడులో రెవెన్యూ గ్రామ సభ

పెదపాడు: కొక్కిరపాడులో రెవెన్యూ గ్రామ సభ బుధవారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పంచాయతీ కార్యాలయం వద్ద, వేంపాడులో మధ్యాహ్నం 2 గంటల నుంచి స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

చురుగ్గా ఆక్రమణల గుర్తింపు సర్వే



గణపవరంలో ఆక్రమణల గుర్తింపు సర్వే చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

గణపవరం: గణపవరంలో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమవుతోంది. మరో వారం పది రోజుల్లోనే పట్టణంలో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించడానికి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజులుగా పట్టణ పరిధిలో ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. దీనితో పాటు నిరంతరం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న పిప్పర కూడలిలోనూ ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ రూపొందుతోంది. గణపవరంలోని పోలీస్ ఐలెండ్ సెంటర్ నుంచి ఇటు ఏలూరు రోడ్డు, భీమవరం రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డు వైపున ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. భీమవరం రోడ్డు వెంబడి సరిపల్లె శివారు వరకూ ఆక్రమణల గుర్తింపు ఇప్పటికే పూర్తయింది. ప్రధాన రోడ్డు నుంచి ప్రభుత్వ భూమి ఎంతమేరకు ఉంది. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రెయినేజి దాటి చొచ్చుకువచ్చిన ఆక్రమణలు ఎన్ని ఉన్నాయన్న దానిని సర్వే సిబ్బంది దృష్టి సారించారు. గణపవరం పట్టణ పరిధిలోని మూడు ప్రధాన రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. డ్రెయినేజీని పూడ్చివేసి, రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షెడ్లు నిర్మించి కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. దీనితో రోడ్లు ఇరుకుగా మారి నిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దాదాపు అన్ని వ్యాపార దుకాణాల ముందు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షెడ్లు నిర్మించారు. దీనితో ఆయా షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి దుకాణాలకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనితో గణపవరంలో ఆక్రమణలు తొలగించాలన్న డిమాండ్ ప్రజల నుంచి దశాబ్దకాలంగా వినిపిస్తోంది. ఇటీవల నారాయణపురం వద్ద భారీగా ఆక్రమణలు తొలగింపు ప్రారంభం కావడంతో గణపవరంలోనూ ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం పూర్తిచేసి నివేదికను తహసీల్దార్‌కు అందచేస్తామని సర్వే సిబ్బంది తెలిపారు. ఈనెల 14న నీటి సంఘాల ఎన్నికలు ఉండటంతో అవి పూర్తయిన అనంతరం ఆక్రమణల తొలగింపు పనులు ప్రారంభించే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

అండర్‌పాస్‌లో ప్రయాణికులకు తప్పని అవస్థ

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం అండర్‌పాస్‌లో రెండు గ్రామాల ప్రయాణికు నరకాన్ని చవిచూస్తున్నారు. రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం వల్ల ప్రయాణ ఇబ్బందులు తప్పుతాయని అందరూ భావించారు. కానీ కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించినా కొత్త బాధలతో సంవత్సరం నుంచి వేలాది మంది ప్రయాణికులు నరకం చవిచూస్తున్నారు. అండర్‌పాస్‌లో నీరు ఎప్పుడూ నిల్వ ఉండటం వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, రైతులు, పాదచారులు ప్రతిరోజూ తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు.రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మానవ హక్కులకు భంగం కలిగించొద్దు

ఏలూరు (టూటౌన్): మానవ హక్కులకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్సీఆర్‌పీఎస్, ఏఐవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో భారత రాజ్యాంగం, మావన హక్కులు, నేటి ఎస్సీ క్రైస్తవుల స్థితిగతులు అనే అంశంపై ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, నిట్టా ప్రసాద్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

పెదపాడు: ఈనెల 13,14,15 తేదీల్లో బుట్టాయిగూడెంలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనం వద్ద సీపీఎం 25వ జిల్లా మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ 13వ తేదీన సీపీఎం బహిరంగ సభ, 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా సీపీఎం కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, సీపీఎం నాయకులు పాల్గొంటారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు కట్టా బాస్కరరావు, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, ముసునూరి కొండలరావు, షేక్ షఫీరా పాల్గొన్నారు.

మాలల గర్జన మహాసభ పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో నిర్వహించే మాలల గర్జన మహాసభను విజయవంతం చేయాలని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ కుమార్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద మంగళవారం వారు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నిట్టా గంగరాజు, పల్లెం ప్రసాద్, దాసరి ఆంజనేయులు, నేతల రమేష్ బాబు, ఎలిపే నరేష్, కనికెళ్లి మురళీ కృష్ణ, చింతా మహాలక్ష్మడు తదితరులు పాల్గొన్నారు.